




"సునందా! కాసిని మంచినీళ్ళిస్తావే."

ఐరావతమ్మ ఆజ్ఞాపించింది. "పైబెర్త్ మీద పడుకున్నారు గదా – మీదగ్గిరేవున్నై మంచినీళ్ళు-నేను లేస్తే పిల్లాడు పడిపోతాడేమోనండీ"—ధైర్యం చేసి అనేసింది సునంద.

"అబ్బో, ఎంత గారాబమో!" బుగ్గలు నొక్కుకుందావిడ.

ఇక లాభం లేదనుకుని సునంద మెల్లిగా లేచి గ్లాసులోకి నీళ్ళుపట్టి అందించింది. గ్లాసందుకుని గొంతులో పోసుకుని ఆవిడ ఇచ్చేలోపలే అనుకున్నంతా అయింది.

పిల్లవాడు శరత్ దొర్లి పడబోవటం, అదృష్టవశాత్తూ చూసిన ప్రభాకరం వాణ్ణి పట్టుకోవటం జరిగింది. ఆ అర్ధరాత్రివేళ – రైల్లో సునందని ఛెడామడా తిట్టటం మొదలు పెట్టాడతను.

"నేనేం చేశాను? మీ మేనత్తగారు మంచి నీళ్ళిమ్మంటే...."

"నోర్మూయ్!"

"అర్థంలేని ఆకోపం ఏమిటండీ ?"

సునంద చెంప ఛెళ్ళుమంది.

"నువ్వు నోరుమెదపద్దు. నా భార్యవై వుండి తిడితే పడలేవా ?" అన్నాడతను.

"ఎందుకు పడాలి అనవసరమైన తిట్లు ?" అనలేదామె — కొడుకుని మటుకు గుండెకు హత్తుకుంది.

"ఏమిటో—ఈకాలం పిల్లలు — మొగుడన్నా మొగుడి తరపువాళ్ళన్నా గౌరవంలేదు. ఎలాపడితే అలా ఎదురు తిరగడమే!" అని గొణిగి అటువేపు తిరిగి పడుకుంది ఐరావతమ్మ.

గుబులు కుమ్మరిస్తున్న గుండెని రాయిచేసుకుని, అశ్రువులు దాచుకుందామని కళ్ళు మూసుకుంది సునంద.

వారం రోజుల క్రితం....

"ఏరా పబ్బీ!" అంటూ వచ్చింది పెద్ద మేనత్త గోవిందమ్మ.

"అత్తయ్యా! రా రా !" అని ఆహ్వానించాడు మేనల్లుడు ప్రభాకరం.

"నీ కొడుక్కి ఏడాదెళ్ళేలోపుగా కొండ మీద జుట్టు తీయించవూ ?"

"తీయించాలి" అన్నాడతను ఏదో ఆలోచిస్తూ.

"ఇంకా ఆలోచనేమిట్రా! పాపం మీ అమ్మా నాన్నా బ్రతికే వుంటే ముద్దుల మనవడి అచ్చటా ముచ్చటా....ప్చ్ సరే—మేం లేమూ ఈ వూళ్ళోనే! ఆవలెల్లుండి మంచిది. ఐరావతానికి కూడా కబురు పెడతా! తెనాల్నుంచి సరోజ కూడా వచ్చి కలుస్తానంది. ఇవేళే వెళ్ళి రిజర్వేషనో ఏదో చేయించుకురా—ఇంతకీ నీ పెళ్ళాం ఏదీ ? బొత్తిగా వంటింట్లోనే కూరుకుపోతుందేంరా ఎవరొచ్చినానూ-మర్యాద నేర్పలేదూ పుట్టింటివారు...." అంటూనే వంటింట్లో కెళ్ళింది.

స్టౌమీదున్న కాఫీనీళ్ళలా ఉడుకుతోంది సునంద మనసు. కుంపటి మీదున్న పకోడీలా వేగుతోంది ఆమె గుండె.

"సరదాగా మాట్లాడకుండా ఈ వంటింట్లో దూర్తావేమిటి ? తొందరగా తెముల్చుకురా—మీ ఆయనేదో ప్రయాణం అంటున్నాడు" అంటూ ఒక పకోడీ తుంపి నోట్లో వేసుకుని ఇవతలి కొచ్చిందావిడ.

పెళ్ళైన కొత్తలో ఒకసారి ఆవిడొస్తే మాట్లాడుతూ కూచుంది సునంద. "చాల్లే లెక్చరు-టిఫినూ కాఫీల సంగతి చూడు !" అని కసిరాడు ప్రభాకరం.

"ఈ రోజుల్లో ఆడామగా తేడా లేదు. మేము ఎప్పుడన్నా మొగుడున్న గదిలో కూచుని మాటాడి ఎరుగుదుమా ? వాళ్ళ చుట్టాలొస్తే వణికిపోతూ వంటింట్లో పడి వండి వార్చటమేగాని...."అంటూ వార్థాటి ప్రదర్శించింది గోవిందమ్మ.

అప్పట్నించీ ఎవరొచ్చినా వంటింట్లోకే పారిపోతుంది సునంద. 'ఏదన్నా మీకు చెల్లుతుందమ్మా-అది నాలికో తాటిపట్టో గాని—ఒకసారి చెప్పినదానికి వ్యతిరేకంగా ఇంకోసారి చెప్పగలరు' అనుకుంది ఉస్సురంటూ.

*

"చూశావా ? ఎక్కడికీ తీసుకెళ్ళనని సాధిస్తుంటావు. చూడు మరి నువ్వడగకుండానే తిరుపతి తీసుకెళ్తున్నా. దేనికైనా కాలం కల్సిరావాలిగాని." ఆ రాత్రి భోజనాల దగ్గిర అన్నాడు ప్రభాకరం.

"కాలం కలిసి రావటమంటే మీ మేనత్తగారి ఆజ్ఞ కావటమా ?"

"ఏం అయితే ? నీ చుట్టాలు నీకున్నట్లే నా చుట్టాలు నాకుండరా ?" అన్నాడు ప్రభాకరం.

"ఎందుకుండరండి చుట్టాలు—ఉండాలి కూడా-కానీ మా వాళ్ళెప్పుడూ ఇలా ప్రవర్తించరే! భార్యాభర్తలను విడదీయ్యడానికి కృషి చెయ్యరే! మేనల్లుడి పెళ్ళాం మీద అజమాయిషీలు చెయ్యరే! ఆమె పుట్టింటివాళ్ళని అహర్నిశలూ ఎద్దేవా చెయ్యరే...."

"అదుగో మాటలు మీరుతున్నావ్ !" కర్కశంగా వినిపించిందతని గొంతు.


కాసేపు నిశ్శబ్దం.

"ఔనుగాని మనం పెళ్ళైన మూడేళ్ళకి కలిసి ప్రయాణం చేస్తున్నాం గదూ ?" మెల్లిగా భార్య పక్కన వచ్చి కూచున్నాడు ప్రభాకరం.

నీరసంగా చూసిందామె.

"ఎంతో సంతోషంగా నేను చెప్తుంటే ఆ ఏడుపు మొహమేమిటి ? ఛ — ఛ" విసుక్కున్నాడతను.

"సంతోషమా ? మీకు సంతోషంగా ఉందా ? పెళ్ళైన మూణ్రోజుల్లోపల వెళ్తున్నామనా ? మూడు నెలల్లోపలా ? మూడేళ్ళు నిండాక.... బాబు పుట్టాకగదా వెళ్తున్నాం — అదీ మనిద్దరం కాదు .... మీ యావత్తుబలగమంతా...."



# అభిషేకం

ఓ.ఉమాదేవి

"వాణ్ణి తిడుతున్నావా?"

"వాడినా? నేను తిడతానా? నా జీవితానికి వెలుగు వెల్లువని - బంగారు దారాల అల్లికని తిడతానా? కానీ వాడు పుట్టకముందర చెయ్యీ చెయ్యీ కలుపుకుని మనిద్దరమే వెళ్ళాలని...." అంటూ అతని ఒళ్ళో వాలి వెక్కి-వెక్కి ఏడ్చింది.

"ఊరుకోవోయ్ నందా!" అంటూ ఓదార్చాడు ప్రభాకరం.

అతనిది ఉత్త యాంత్రిక జీవితం — గాఢ ప్రేమా, కాంక్ష, శృంగారం వగైరా బొత్తిగా తెలీవు. ఎందుకు పెళ్ళాం అప్పుడప్పుడు ఇలా గగ్గోలు పెట్టి ఏడుస్తుంటుందో అతని బుద్ధికి అతీతమైన విషయం.

"పెళ్ళైన కొత్తలో ఎంతో అద్భుతంగా కన్పించే దాంపత్య జీవితాన్ని ప్రకృతి అందాల్లో తేలి అనుభవించాలని....ప్చ్-ఏమిటో నా కలలన్నీ నేలమట్టంగా కూలిపోయినై గదా—మీరింత నీరసులని నాకు తెలీలేదండీ—హనీమూన్ కెళ్ళటంసరే—మీతో సినిమాకైనా వెళ్ళటానికి నోచుకోలేదు నేను! నేనూ మా వారూ ఊరి కెళ్ళాలి. సినిమాల కెళ్ళాలి. రిక్షాల్లో రైల్లో పక్కపక్కన కూచోవాలి. కనీసం రోడ్డుమీదనైనా కలిసి నడవాలి. అదీ కాకపోతే ఇంట్లోనైనా సరదాగా ఉండాలి. అయ్యో! నా ఈ చిన్ని కోరికలకు కూడా సమాధి కట్టేశాదే దేవుడు...." విజృంభించి వెల్లువై ప్రవహించిందామె ఆవేదన.

"అబ్బ! ఆడవాళ్ళతో కలిసి సినిమాలవీ చూడటం—నాకు సిగ్గూ, చిరాకూ అసహ్యమూనూ...." తేల్చి పారేశాడతను.

"హుం నేనెంత ఆవేదనగా చెప్తున్నానూ—మీరెంత తేలిగ్గా తీసుకుంటున్నారు – కనీసం నా ఆవేదన ఎంత గాఢమైనదో, నా ఆ కాంక్ష ఎంత తీవ్రమైనదో కూడా తెలుసుకోలేరు గదూ మీరు...ప్చ్—మనిద్దరి ఊహలూ ఉత్తరదక్షిణాలు-"

"ఏమిటో-నువ్వూ నీ గోలా? నాకు అర్థం కాదు."

"అదిసరే – టిక్కెట్లకి డబ్బిచ్చారా వాళ్ళు?" మామూలు స్థితికొచ్చి అడిగింది సునంద. "మీ చుట్టాల్లాగా మా వాళ్ళేం పిసినార్లు కాదులే – వాళ్ళే ఇస్తారు తర్వాత – మా అత్తలు ముగ్గురూ లక్షాధికార్లు – తెలుసుగా?" అన్నాడు అతను.

"ఓహో – అప్పుడెప్పుడో డబ్బు అవసరంగా ఉందని నా గొలుసు తాకట్టుపెట్టారే – అదెప్పుడు విడిపిస్తారో?"

"అదా – అదీ, తిరపతినించీ రాగానే!" నాన్చాడు అతను.

నవ్వేసింది సునంద.

"అందవిహీనులకి గాని నా అందాలబొమ్మకి సొమ్ములెందుకసలు!"

"ఆహాఁ! ఇన్నాళ్ళకిగదా నా జన్మ ధన్యమైంది-శ్రీవారి కవిత్వం విని. నాకు చీరలు చిరిగిపోతునై....ఇప్పుడేం అంటారో?" అన్నది సునంద.

"కొందాంలే-ఊర్నించి రానీ....డబ్బు చూసుకోవాలిగా?" అన్నాడు అతను.

*

ఊరికెళ్ళేరోజు రానేవచ్చింది.

"అన్నీ సర్దేసి గంటముందుగానే రెడీ అయివుండు. నాకు ఆఫీసులో పార్టీవుంది టైముకొచ్చేస్తాలే!" అన్నాడు ప్రభాకరం అద్దంలో చూసుకుని టై సర్దుకుంటూ.

"ఎలాగండీ ఈ అల్లరి బాబుతో-నేనొక్కదాన్నీ సర్దలేను!" జాలిగా అంది సునంద.

కానీ లాభం లేకపోయింది.

సునంద దుంపతెగింది - చలికాలం బాబుతో ప్రయాణం. అందుకని అవసరమైన వన్నీ తీసి సర్దింది. పిల్లాడు సర్దినవన్నీ తీసి పారేస్తూ ఒకటే అల్లరి చేస్తున్నాడు.

అంతలో అప్పచెల్లెళ్లైన ఐరావతమ్మా, గోవిందమ్మా సామాన్లతోబాటు వచ్చేశారు.

"సునంద చదువుకుందన్న మాటే గాని అస్సలు చురుకుదనం లేదు. పబ్బీ తిడతాడంటే తిట్టడూ? ఈపాటికి రెడీగా వుండాల్సింది తను" అని వ్యాఖ్యానాలు చేశారు.

'మీకేం తల్లీ! చెప్తారు. ఒకరి మొగుడు పారిపోయీ, ఒకరి మొగుడు చచ్చిపోయీ - మీ బారినుంచీ తప్పించుకుని సుఖపడిపోయినారు పరలోకం చేరుకుని. పిల్లా పీచూ లేరు పైగా' – కసిగా అనుకుంది సునంద.

స్టేషన్ చేరారంతా....

టాక్సీకి, కూలీలకి, ప్రభాకరం డబ్బిస్తుంటే చురుగ్గా చూసింది సునంద—

అందరూ రైల్లో ఎక్కారు - వాళ్ళ వెనకాలే కొత్తబట్టలూ, నునుసిగ్గులూ, చిరునవ్వులూ కలబోసుకుంటున్న దంపతులు ఎక్కారు. సరి కొత్తగా పెళ్లైనట్లుంది. వాళ్ళకి ఫోటోలు తీసేవాళ్ళూ, వీడ్కోలు చెప్పేవాళ్ళూ ప్లాట్‌ఫారమంతా సందడిగా వుంది.

ఆ అమ్మాయి చక్కగా వుంది. తల్లో పూలు, మెళ్ళో పసుపుతాడూ....అతని చూపుల్నిండా ఆరాధన పరవళ్ళు తొక్కుతోంది.

సునంద మనసు జివ్వుమంది.

'ఏం నోములు నోచిందో ఆ పిల్ల!'

ఐరావతమ్మా, గోవిందమ్మా ప్రతి స్టేషన్లో ఏవో కొంటూ - తింటూనే వున్నారు. ప్రభాకరం వాటికి డబ్బిస్తూనే వున్నాడు. కొడుకుతో కాలక్షేపం చేస్తున్న సునందని ఒకటి రెండుసార్లు కృతక శృంగారం ఒలికిస్తూ పలకరించబోయాడు ప్రభాకరం. మొహం తిప్పేసుకుందామె.

"మనిద్దరం కలిసి ఇన్నాళ్ళకి ప్రయాణం చేస్తుంటిమి. కాస్త సర్దాగా మాట్లాడుకుందామంటే ఎడమొగం పెడమొగం పెడతావేం?" అన్నాడు.

"ప్లీజ్; ఇంకేం మాట్లాడకండి – అబ్బాయికి పాలుకలపాలి" అంటూ తప్పించుకుంది సునంద.

పాలసీసా కడుగుతూ ఓరగా ఆ జంటవేపు చూసిందామె.

ఆమెకు కూడా సిగ్గేసే తీరులో మాట్లాడుకుంటున్నారు వాళ్ళు గుసగుసలుగా.

మళ్ళీ మొదలెట్టాడు ప్రభాకరం. "మొగుడితో మాట్లాడదామనైనా లేదునీకు....సరే-నాకు పై బెర్త్ మీద పక్కెయ్యి" అన్నాడు చివరకి.

'ఆ బెడ్డింగ్ విప్పాలంటే దుంప తెగుతుంది. పిల్లాడితో ఇంత అవస్థ పడుతున్నా గదా ఆ పక్క తనే వేసుకోకూడదూ?' అని చిరాకు పడింది ఆమె. విసురుగా బెడ్డింగ్ విప్పడం మొదలు పెట్టింది.

"ఏమిటా పొగరు?" కసిరాడు అతను. కన్నీరు అణచుకుంటూ ఆ జంటవేపు చూసింది సునంద.

ఆ యువకుడు తనకూ భార్యకూ పక్కలు వేస్తున్నాడు. ప్రభాకరం కూడా అటు చూసి మొహం చిట్లించాడు.

"ఛ–ఆడంగివాళ్ళు – నాకసహ్యం. అలా చేస్తే నెత్తికెక్కరూ పెళ్ళాలు?" అంటూ నిద్రకుపక్రమించాడు.

"ఆహా! ఎంత ఉన్నతోద్దేశాలండి తమవి! భర్తచేత చాకిరీ చేయించుకుని కులకడు ఏ ఆడదైనా! పరస్పర అనురాగమంటే మీకర్థంకాదు. కట్టుకున్నవాడు తననెంత గౌరవిస్తున్నాడని తెలిస్తే అతనిని ఆనంద బాష్పధారలతో అభిషేకం చెయ్యదా భార్య? భార్యని కొట్టీ తిట్టీ అధికారం స్థాపించుకుంటున్నామనుకుని జీవితం నరకప్రాయం చేసుకుంటారు పాపం కొందరు!" అంటూ మళ్ళీ వాళ్ళవేపు చూసింది సునంద.

ఆ కుర్రాడు భార్య దుప్పటి సరి చేస్తున్నాడు "అలా అయితే దుప్పటి దగ్గిరి నుంచీ కప్పి నీకు సేవచేస్తే మంచివాణ్ణి. లేకపోతే కాదు-అంతేగా?" ప్రభాకరం గొంతువిని ఉలికిపడింది సునంద.

"ఛీ-ఊరుకోండి అంతమాటెందుకు? మీచేత నేను దుప్పటి కప్పించుకుంటానేమిటి? పైగా పదిమందిలో?"

నిద్రనటిస్తున్న అక్కా- చెల్లెళ్ళు ఒంటికి కారం రాచుకున్నట్లు బాధపడ్డారు.

కాసేపు ఓపికపట్టి సునందని మంచినీళ్ళు తెమ్మని పురమాయించి ఆకచ్చ తీర్చుకున్నారు ఎలాగో.

ఇంతలో రైలు ఆగింది. సరోజమ్మా-ఆమె కూతురులీలా, కొడుకు శేఖర్ వచ్చి ఎక్కారు. తెనాలి దాటేటప్పటికి అంతా గాఢనిద్రలో పడ్డారు. తెల్లవారాక లేచి కాఫీ జపంచేస్తూ కూచున్నారు.

గూడూరుస్టేషన్లో ప్రభాకరం, శేఖర్ వెళ్ళి కాఫీ, టిఫిన్లు తెచ్చారు.

'నా మనీ అంతా అమ్మదగ్గిరుంది పబ్బీ!' అన్నాడు శేఖర్. అతనూ ఉద్యోగస్థుడే.

తానే డబ్బు చెల్లించాడు ప్రభాకరం.

శరత్ అల్లరైతే పట్ట శక్యం కాకుండా వుంది. సునంద దిగులుపడుతోంది 'వీడితో ఎలా ఈ యాత్రపూర్తిచేస్తాన్రా దేవుడా!' అని. 'ప్రభాకరం కూడా వాణ్ణి కాసేపు ఆడిస్తే బావుండును కానీ అంత అదృష్టమా?' అనుకుంది ఆమె. ఎలాగో తిరపతిలో దిగారు.

కష్టంమీద ఒక హోటల్లో రూమ్ తీసుకున్నాడు ప్రభాకరం. రోజుకి 20 రూపాయల అద్దె. కానీ చాలా చిన్నది రూమ్.

ముందు బాబుకి నీళ్ళు పోసి, చక్కగా డ్రెస్ చేసి ఫ్రెష్‌గా కూచోబెట్టింది సునంద. తర్వాత



# టేబుల్ టెన్నిస్ ఛాంపియన్ ఉష

జైపూర్‌లో ముగిసిన జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పదమూడు సంవత్సరాల బాలిక పెద్ద సంచలనం కలిగించింది. బాలికల విభాగంలో సెమీ – ఫైనల్ ఘట్టానికి చేరుకున్న ఆ బాలిక – స్త్రీల విభాగంలో మధ్యప్రదేశ్‌కి చెందిన రీటాజైన్‌ని ఓడించి ప్రీ క్వార్టర్ ఫైనల్‌కి చేరుకోవడం విశేషం.

బాలికలలో జాతీయస్థాయిలో నాలుగవ గణ్యస్థానం లభించిన ఉష మరి మూడు సంవత్సరాలు బాలికల విభాగంలో ఆడడానికి అవకాశం వుంది.

హైద్రాబాద్ రోజరీ కాన్వెంట్‌లో తొమ్మిదవ తరగతి చదువుతోన్న ఉష-ప్రతి రోజూ బర్ ఖత్ పూరా ప్రాంతంలోని తన ఇంటి నుంచి ఫతే మైదాన్ వద్దకు టేబుల్‌టెన్నిస్ సాధన చేయడానికి ఆరు మైళ్ళు బస్‌లో ప్రయాణం చేస్తూ వుంటుంది. రెండు గంటలసేపు - ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ శిక్షకుడు కుర్షీదాలీ చెప్పే టేబుల్‌టెన్నిస్ పాఠాలు శ్రద్ధగా వింటుంది. ఆంధ్రప్రదేశ్‌కి చెందిన అగ్రశ్రేణి ఆటగాళ్ళు దిలీప్‌రాజ్ సక్సేనా, అశోక్ వంటి ప్రముఖులతో ఆడుతూ తన ఆటని మెరుగు పరచుకుంటూ వుంటుంది.

1972లో మొట్టమొదటిసారిగా ఉష జాతీయ పోటీలలో పాల్గొన్నది. ఆ జాతీయ పోటీలు అహమ్మదాబాద్‌లో జరిగాయి. ఆ తర్వాత ప్రతి జాతీయ పోటీలోనూ ఆంధ్రప్రదేశ్ జట్టులో సభ్యురాలుగా ఉషకి అవకాశం లభిస్తోంది.

1973లో సికింద్రాబాద్ లయన్స్‌క్లబ్ నిర్వహించిన పోటీలో లభించిన విజయంతో ఉష టేబిల్ టెన్నిస్‌లో ముందంజ వేయడం ప్రారంభించింది. ఈ పోటీ ఉష పాల్గొన్న మొదటి పోటీ. ఆ రోజుల్లో హైద్రాబాద్ వై.యం.సి.ఏ.లో ప్రతి రోజూ ప్రాక్టీస్ చేసేది. మీర్ ఖాసిం ఆలీ వంటి అంతర్జాతీయ ఆటగాడి ప్రతిభని గమనించడానికి ఉషకి అవకాశం కల్గింది.

1973లోనే జరిగిన 'పాపయ్య మెమోరియల్ టోర్నమెంట్' ఉషకి ఎంతో మనోధైర్యం ఇచ్చింది. 1975లో ఈ పోటీలోనే బాలికల విభాగంలోనూ, స్త్రీల విభాగంలోనూ ఉష నెగ్గింది.

జంటనగరాలలో జరుగుతోన్న ప్రతిపోటీలోనూ గత రెండు సంవత్సరాలుగా ఉష విజయాలు సాధిస్తోంది.

"టేబుల్ టెన్నిస్ కాక క్రికెట్ కూడా అప్పుడప్పుడు ఆడుతూ వుంటాను. కర్ణాటక సంగీతం నేర్చుకుంటున్నాను. టేబుల్ టెన్నిస్‌లో ఇందూపూరి అంటే నాకు ఎంతో ఇష్టం. ఆటల్లోనే కాదు-చదువులోనూ నేను మంచి మార్కులు తెచ్చుకుంటాను" అంటుంది ఉష.

'అఫెన్స్'లో చాకచక్యంగా ఆడే ఉష 'ఫోర్ హాండ్ స్ట్రోక్స్'లో నేర్పరి. ప్రత్యర్థికి 'ఎటాక్' చేయడానికి అవకాశం ఇవ్వకుండా తనహద్దుల్లో పెట్టి ఆడడం ఉష నేర్చుకున్న విజయసూత్రం.

ఆంధ్రప్రదేశ్‌కి ఒకరోజున సయద్ సుల్తానా అంతర్జాతీయ కీర్తితెచ్చింది. ఆ స్థాయినందుకున్న మరొకరు నిన్నటి వరకూ ఆంధ్రప్రదేశ్‌లో లేరు. ఉష రాకతో ఆ లోటు తీరుతుందని క్రీడాభిమానులు ఆశించవచ్చు.

పి. దుర్గ

తను స్నానం చేసింది. ఆమె తెచ్చుకున్న సబ్బుతోనే మిగతా జనమంతా స్నానాలు కానిచ్చారు.

ఇంతలో బుట్టలో దాచిన అద్దం తీసి పగులకొట్టి నానా ఆగమూ చేస్తున్నాడు శరత్. ఆ పగిలిన అద్దం పట్టుకుని తల్లికి అందకుండా హోటలంతా పరుగులు పెట్టసాగాడు.

బయటి నుంచి వచ్చిన ప్రభాకరం "అద్దం పగలకొట్టావా సునందా!" అని అడిగాడు కోపంగా.

"మీ సుపుత్రుడే. వీళ్ళున్నారు గదాని స్నానానికెళ్ళా...."

"చాల్లే – చేసింది చాలక...."

"అంటే మీరనేది?"

"నీ పొగరూ, వాగుడూ తగ్గించుకోమని."

అప్పటిదాకా అణిచిపెట్టుకుంటూ వస్తున్న దుఃఖం ఉవ్వెత్తున పొంగింది.

"వెధవకానా, నీ అల్లరీ నువ్వూ నూ – నాప్రాణాలు తోడేస్తున్నావు!" అంటూ శరత్‌కి రెండు తగిలించింది సునంద. వాడు ఏడుపు లంకించుకున్నాడు. చిరాగ్గా వాణ్ణి రెండు కసిరి బయటికి తీసుకెళ్ళాడు ప్రభాకరం.

లీల లెక్చరివ్వసాగింది: "దేనికైనా ఓర్పు వుండాలి—ముఖ్యంగా ఆడవాళ్ళకి" అని.

"ఔను – సునందగారికి బొత్తిగా పేషెన్స్ లేదు – కాఫీ లేకపోతే కూడా ఉండలేదు" అన్నాడు శేఖర్.

రెచ్చిపోయింది సునంద—తన గురించి అలా విమర్శలు చేసేందుకు వీళ్ళెవరు అసలు అని. పైకి మటుకు "ఎంత సునిశిత బుద్ధండీ మీది! కానీ శేఖర్‌గారూ! అందర్నీ ఏదో ఒకటి అనేందుకు మనకెవరూ కోరాపట్టా రాసివ్వలేదు!" అన్నది.

మూతీముక్కూ ముక్కూమూతీ విరుచుకున్నారంతా.

సునంద మామూలుగా నవ్వేసింది. ఆ తర్వాత 'ఈ రాహుకేతువులంతా కలిసి నా ప్రభాకరాన్ని నాకు దూరం చేస్తున్నారుగదా – నాకేది దారి?' అని చెక్కిట చెయ్యిచేర్చి ఆలోచనలో పడింది.

"వాళ్ళంతా మీల్స్‌కెళ్తున్నారు – నువ్వు రావేం?" అంటున్నాడు ప్రభాకరం.

అప్పటి ఆమె మనసు అతని పట్ల మెత్తబడి వుంది. తను అనవసరంగా కోపం తెచ్చుకుంటోందేమో అనుకుంది.

"పదపద....అన్నం తింటే ఆలోచనలు బాగా వస్తై" అన్నాడు అతను నవ్వుతూ.

అమాంతం అతన్ని పెనవేసుకుందామె. "ఏయ్! ఏయ్ పిల్లా! ఇది తిరపతి—ఛేతిలో బాబు."

"ఛీ మీరు మూడ్ అంతా పాడుచేస్తారు" అంటూ దూరంగా జరిగింది ఆమె.

"మొదట్నించీ ఇట్లావుంటే నేనెందుకు కోప్పడతాను చెప్పు." మృదువుగా అన్నాడతను.

అంతలోకి శేఖర్ పరిగెత్తుకు రానే వచ్చాడు "మీరు రారేం ఇంకా" అంటూ.

"ఇదుగో. మీ చెల్లెలే ఆలస్యం చేస్తోంది. మనిద్దరం ఏకాంతంగా మాట్లాడుకుందాం అంటూ" అని భార్యవైపు ఓరగా చూశాడు ప్రభాకరం.

"నిజమేననుకోగలరు ఆయన మీ కోతలన్నీ! ఇక పదండి!" విప్పారిన మొహంతో బయలేరింది సునంద.

భోజనాలు చేసి కొండకెళ్ళే బస్సు ఎక్కారంతా. సునంద మనసు భక్తితో నిండిపోయింది.

చేతుల్లో శరత్ అల్లరి చేసిచేసీ నిద్రకొరిగాడు.

కొండమీద కాటేజ్‌లో సామాను పడేసి పిల్లాడికి జుట్టు తీయించారు—మహా అవస్థపడి వాణ్ణి పట్టుకుని.

ప్రభాకరం ఎవర్నో తెలిసినవాళ్ళని తీసుకొచ్చాడు సులభదర్శనం కోసం.

చీకటిపడేవేళ....అంతా స్వామి దర్శనానికి బయల్దేరారు.

సునంద స్వామి దర్శనం కోసం అర్రాడుతున్నది.

కళ్ళు జిగేల్మనేలా దారికి రెండు పక్కలా షాపులు లైట్ల వెల్తుర్లో మెరిసిపోతున్నాయి.

"ఆ రాగి చెంబు ఎట్లా అబ్బాయ్! ఇదుగో ఈ దేవుడి విగ్రహం ఎంత?" అని ఒక కొట్టు దగ్గిర ఆగి ప్రశ్న వేసింది సరోజమ్మ.

"చచ్చాంరా బాబూ, వీటికి కూడా నన్నే డబ్బివ్వమనరుగదా?" సునంద పక్కన నుంచుని స్వగతం పలుక్కున్నాడు ప్రభాకరం.

"నేను మొదటేచెప్తే వినిపించుకున్నారా? స్వయంకృతాపరాధం—తప్పదు శిక్ష" అన్నది సునంద.

"ఒరే పబ్బీ! ఏమిట్రోయ్ మీ నవ్వులు. నాకో నాలుగు రూపాయలు చిల్లరుంటే ఇవ్వు. వందరూపాయల నోటు మారక అన్నింటికీ నిన్నే అడగవలసివస్తున్నది" అంది గోవిందమ్మ హఠాత్తుగా వెనక్కి తిరిగి.

"దాన్దేముందిగాని. నా దగ్గిరా చిల్లర లేదే" అని నొచ్చుకున్నాడు ప్రభాకరం.

అప్పచెల్లెళ్ళు ముగ్గురూ ఆ మాత్రానికే మొహాలు మాడ్చేసుకోవటం చూసి అతని మనసూ చివుక్కుమన్నది.

"వెనకాల వస్తున్న శేఖర్‌గారి దగ్గిరుందేమో చిల్లర" అన్నది సునంద—

"నా దగ్గిరా? ఎబ్బె నా దగ్గిరెక్కడిది?" అని అతను తత్తరపడుతుంటే నవ్వొచ్చింది సునందకు.

*

ప్రభాకరం ఫ్రెండు రఘుపతి తీసుకెళ్ళడం వల్ల దర్శనం సులభంగా అయింది. స్వామిని చూసి పరవశించి పోయింది సునంద.

అట్నించే అంతా హోటల్‌కెళ్ళారు. బిల్లంతా యధాప్రకారం ప్రభాకరమే చెల్లించాడు.

వాడువారిన భర్త మొహం చూసి నిట్టూర్చింది సునంద. అప్ప చెల్లెళ్ళు ముగ్గురికిగాని, వాళ్ళ పిల్లలిద్దరికిగాని ఏ చింతా వున్నట్టు లేదు – ప్రతిచోటా డబ్బివ్వటం ప్రభాకరం కర్తవ్యం అన్నట్టున్నారు.

సరోజమ్మా ఆమె కూతురూ ఉన్న ఒకే మంచం మీద నడుం వాల్చారు.

"సునందగారూ! మీ దగ్గిరేమన్నా దుప్పటి వుందా? హడావుడిగా బయల్దేరాం కదా - తెచ్చుకోలేదు" అని అడిగాడు శేఖర్.

"హడావుడా? ముందరే మీరంతా ప్లాన్ వేసుకుంటిరిగదండీ...." అందామె.

"అదంతా నీకనవసరం. ఉంటే ఇవ్వు లేకపోతే లేదు – అంతే" ప్రభాకరం చిరాకు పడ్డాడు.

తను కప్పుకోబోతున్న దుప్పటి అతనికిచ్చేసింది సునంద—తర్వాత ఒకటే వణుకు—చలి. పసిపిల్లాడితో అలాగే కింద పడుకుంది ఆమె.

మర్నాడు ఉదయం – అంతా స్నానాలు కానిచ్చి దిగువకి బయల్దేరారు.

కిందికెళ్ళి భోజనాలు కానిచ్చి అలిమేలు మంగాపురం బయల్దేరారు. ఆ తర్వాత గోవిందరాజ

స్వామి వారి దర్శనం చేసుకున్నారు. అన్నిటికీ యధాప్రకారం డబ్బిస్తున్నారు ప్రభాకరం.

తిరిగి హోటల్‌కి రాగానే వాళ్ళంతా మొహాలు కడిగేసుకుని, పౌడర్లు పట్టించేసి, మళ్ళీ పట్టు చీరలు కట్టేసుకుంటున్నారు.

"ఎక్కడికండీ" అని అమాయకంగా అడిగింది సునంద—ఆ అప్పచెల్లెళ్ళనుద్దేశించి.

"అదే-నీకుతెలీదూ? పెళ్ళివారింటికి" అన్నారు.

"ఏ పెళ్ళివారింటికండీ?"

"శేఖర్‌కి వాళ్ళమ్మాయినీ, లీలని వాళ్ళబ్బాయికీ చూస్తున్నాం — ఏదీ—పెళ్ళిచూపులకి రావడం ఇప్పటికి పడింది."

శిలలా అయిపోయింది సునంద.

'ఇందుకా? ఆయనని బయల్దేరదీసి ఇంత డబ్బు ఖర్చుపెట్టిస్తున్నది! ఆయన శ్రేయస్సుకోరే మేనత్తలావీళ్ళు?' అని గిలగిల్లాడింది ఆమె.

ఆ విచారం మధ్యన ఒక మెరుపు తీగె.

'వీళ్ళంతావెళ్తే తనూ ఆయనా కాసేపైనా మాటాడుకోవచ్చు—' అనుకుంది.

"పబ్బీ ఏడి? ఇంకా తయారుకాలేదా?" అంటోంది ఐరావతమ్మ.

నెత్తిమీద పిడుగు పడినట్లు కూలబడిపోయింది సునంద.

ఆమెనొక్కదాన్నీ వదిలేసి కువకువలాడ్తూ వెళ్ళిపోయినారు అంతా—రమ్మని పిలవనైనా లేదు ఎవరూ.

మన బంగారం మంచిదైతే కంసాలినననటం దేనికి? అనుకుంది ఆమె. కట్టుకున్నవాడికే తను గుర్తుండదు — ఎప్పుడూ అత్తయ్యలే, సమస్తం అత్తయ్యలే! పెళ్ళైనప్పట్నించీ చూస్తోంది. ఆ దుఃఖపు చీకటి మధ్య వెలుగునిచ్చే చిన్న దీపమైన శరత్ అల్లరితో కాసేపటికి మామూలు మనిషైందామె.

భోజనాలవేళకి వచ్చారంతా. వెంటనే మీల్స్ సెక్షన్‌కి బయల్దేరారు.

"అయ్యో! పర్సు మళ్ళీ మర్చిపోయినారా పబ్బీ! రూంలో" అంది గోవిందమ్మ—ప్రభాకరం టిక్కెట్లు కొంటుంటే.

"ఫర్వాలేదులే" అంటూ సవ్వాడతను ఏం చెయ్యాలో తెలీక.

ఆ రాత్రి సొమ్మసిల్లి నిద్రపోయిన సునందకి ఏవో మాటలు విన్పించి హఠాత్తుగా మెలకువ వచ్చింది.

ఆమె చెవులు నిక్కబొడుచుకున్నాయి.

"బావా! నిన్ను నేనెంత ప్రేమించేదాన్నో మరిచిపోయినావా బావా!" సన్నగా ఏడుస్తున్న లీల గొంతు.

"అదంతా ఇప్పుడెందుకులే లీలా! పడుకో! అమ్మావాళ్ళూ నిద్రలేస్తే బావుండదు" అనునయంగా తన భర్త గొంతు.

"లేవనీ—నాకేం భయంలేదు. అప్పటికి నీకు ఉద్యోగం లేదని మన పెళ్ళి పడనివ్వలేదు—అమ్మా పెద్దమ్మావాళ్ళు. నీ పక్కన సునందని చూస్తుంటే నాకెంత రంపపు కోతగా వుందో ఎలా చెప్పను బావా!" ఏడుపు ఆపుకోవటానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నది లీల.

"పిచ్చీ....అనుకున్నవన్నీ జరుగుతాయా? విధి ఇలా ఉంది. మనం సరిపెట్టుకోవాలిగాని ఏడవకూడదు వృధాగా. నీకు పెళ్ళి కుదురుతున్నదాయె. ఇవాళ చూసిన పెళ్ళికొడుకు డాక్టరుగదూ? నచ్చాడా? నచ్చకేం లే? మంచి ప్రాక్టీసు, బంగళా, కారూ....ఎంత అదృష్టవంతురాలివి! పాత సంగతులు మర్చిపోవాలి....ఏదీ ఒక్కసారి నవ్వుమరి!"

భర్తమాటలువిని లోలోపలే అతనికి జోహార్లు చేసింది సునంద.

"నవ్వనా బావా! నీకూ్కడా నా బ్రతుకు నవ్వులాటగా వుందా?"

"పెళ్ళి పీటలమీద కూచోబోతున్న అమ్మాయి మాట్లాడే మాటలు ఇవికావు లీలా! పెళ్ళికొడుకు గురించి ఏమన్నా చేస్తే వింటా—లేకపోతే మా ఆవిడ తెచ్చిన రగ్గు కప్పేసుకుని హాయిగా నిద్రపోతా—నా మాటలు విని నువ్వు కూడా చెక్కి కలర్ కలలుకంటూ నిద్రపో" అంటూ మొహం నిండా ముసుగెట్టేసుకున్నాడు ప్రభాకరం.

అతని నిరాదరానికీ, నిశ్చింతకీ గుండె మరింత మండిపోగా—రెండు చేతుల్లోనూ మొహం దాచుకుని కుమిలి కుమిలిపోతున్న లీలని చూసి 'అయ్యో అభాగ్యురాలా!' అనుకుంది సునంద — ఆమె కళ్ళనించీ రెండు కన్నీటి బొట్లు రాలినాయి.

మర్నాడు పొద్దున్నే తిరుగు ప్రయాణం కట్టారు.

*

ఆ మర్నాటి సాయంకాలం తల నిండా సన్న జాజుల మాల తురుముకుని, కనకాంబరం రంగు చేనేత చీర కట్టుకుని, బొట్టూ కాటుకా పెట్టుకుని కొడుక్కి పాలు పడుతున్నది—సునంద.

"అప్పుడే సింగారం పూర్తయింది. మరి వంట?" ఆఫీసునుంచి వచ్చిన ప్రభాకరం అదుర్దాపడ్డాడు.

"ఆకలేస్తోందా!" అని నవ్వుతూ కాఫీ తెచ్చింది సునంద: "వంట పూర్తయింది. పావుగంటాగి భోంచేద్దురుగాని. మీ కిష్టమని వంకాయ కూరా కొబ్బరి పచ్చడీ...."

"స్టాప్ - నా కిష్టమేమిటో తెలుసా? నువ్వూ—శరత్—"

'చాలండీ — చాలు — ఇంత ఆదరం భరించలేను' అనుకుంది సునంద మనసులో.

పైకి మటుకు — "బావుంది నేను కూరా వాడు పచ్చడీనా" అని బుంగమూతి పెట్టింది.

"బాబు మాట ఎలా వున్నా నీ సంగతి రైటే.... తినేసే విషయంలో—కూర నోటితో తింటే...."

"చాల్చాలు బాబోయ్! ఏమండీ! ఇన్ని మాటలెక్కడ నేర్చుకున్నారండీ?" విస్తుపోయింది సునంద.

"మాటలు రావంటావా అయితే నాకు? సరే—చేతల సంగతి చూడు" అంటూ ఒక పాకెట్ విప్పి ఒక చీర ఆమె బుజం మీద వేసి, గొలుసు ఆమె మెళ్ళో వేశాడు.

"ఏమండీ! ఏమిటండీ ఇవి? అసలే అప్పుల్లో వున్నాం— మొన్నటి...."

"ఆపావేం? మొన్నటి తిరపతి ప్రయాణంలో చాలా ఖర్చయింది కూడా—అదేనా? నిజమే. ఆ ఖర్చుతోపాటు ఇదీ ఒకటి అనుకుంటే పోలా? ఏం? వాళ్ళందరికీ అంత డబ్బుధారపొయ్యగాలేంది నా ఇల్లాలికి ఒక్క కట్టుడు చీర కొని, గొలుసు విడిపించలేనా? అన్నట్టు కాస్త చవగ్గా వచ్చిందని శరత్‌కు ఒక చొక్కా కొన్నా" అంటూన్న భర్తను ప్రేమగా చూస్తూ — చూపులతోనే అభిషేకం చేసింది సునంద. □